క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



పాలువాయి జంక్షన్(రెంటచింతల): వేసవిలో ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు సత్రశాల పరాశక్తి సిమెంట్ ప్యాక్టరీ యాజమాన్యం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తహసీల్దార్ మూఢావత్ అర్జున్ నాయక్ అన్నారు. సోమవారం పాలువాయి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు, ఆర్ఐ పల్లా రామకృష్ణ, సిమెంట్ ప్యాక్టరీ ప్రతినిధి కేసర వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దుక్కులకు అనుకూలం

రెంటచింతల: సాగు భూములు దుక్కి చేసుకునేందుకు ఇదే అనుకూలమైన సమయమని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో పంట పొలాల్లో దుక్కులను వాలుగా, లోతుగా దున్నుకోవాలని తెలిపారు. లేకపోతే.. వర్షపు నీటికి భూమి కోతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వాలుకు అడ్డంగా లోతు దుక్కుల వల్ల వ్యవసాయభూమికి ఎక్కువ తేమను కలిగి ఉండే సామర్థ్యం వస్తుందన్నారు. ప్యూపా దశలో ఉన్న గులాబి రంగు పురుగులు చనిపోతాయని దీంతో రైతులకు పంట నష్టం ఉండదన్నారు. లోతుగా దున్నిన భూమిలో మొక్కల వేర్లు లోతుగా పాదుకుని వెళ్లడం వల్ల సాగుచేసిన పంట దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. దుక్కి దున్నుకోవడం వల్ల అయ్యే ఖర్చు కన్నా దాని ద్వారా రైతుకు చేకూరే ప్రయోజనమే ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

పాస్టర్ ప్రవీణ్‌కు ఘన నివాళులు



గురజాల: పాస్టర్ పగడాల ప్రవీణ్‌కు మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. పాస్టర్‌లు మాట్లాడుతూ ప్రవీణ్ కేసును త్వరితగతిన వెంటనే విచారణ జరిపించాలని, పోస్టుమార్టం, ఫారెన్సిక్, టాక్సలజీ రిపోర్టు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా తెలుగు బాప్టిస్టు చర్చి నుంచి ర్యాలీగా బయలుదేరి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డివిజనల్ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కత్తి చలమరాజు, కర్రా చినకోటేశ్వరరావు, కలివెల ప్రభుదాసు, మండల పాస్టర్లు తదితరులున్నారు.

ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ

పిడుగురాళ్ల: ఆస్తి పన్ను చెల్లింపుపై 5 శాతం తగ్గింపు ప్రభుత్వం కల్పించిందని పట్టణ మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ సోమవారం తన కార్యాలయంలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నెల 7 నుంచి 30వ తేదీ లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ అందిచనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పుర ప్రజలు సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో కుడా ఆస్తి పన్ను చెల్లించవచ్చన్నారు.

9న దేవాలయ భూములకు కౌలు వేలం

రెంటచింతల: మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం భూముల కౌలు సాగుకు ఈ నెల 9న బహిరంగ వేలం పాట స్థానిక శివాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న బహిరంగ వేలం పాటలో పాల్గొన్న వారికి 2025–2028 వరకు 3 ఏళ్లపాటు కౌలు హక్కును పొందడం జరుగుతుందన్నారు. మొత్తం 15.30 ఎకరాల మెట్టభూమికి జరిగే ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేలు ప్రథమ ధారావత్తు చెల్లించి పాల్గొనాలని తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

చిన్నారి అదృశ్యంపై కేసు నమోదు

గురజాల: చిన్నారి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వై.వినోద్‌కుమార్ సోమవారం తెలిపారు. గురజాలకు చెందిన షేక్ మీరావలి, షాహీనాల కుమార్తె సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అనంతరం తిరిగి రాలేదు. బంధువులను విచారించినా ఆచూకి లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.చిన్నారి 8వ తరగతి చదువుతోందని, తెలుపు రంగు పంజాబీ ధరించిందని, ఎవరికైనా కనిపిస్తే వెంటనే గురజాల పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఎస్ఐ తెలిపారు.

కుంగిపోతున్న కౌలురైతు

- కంది పంటకు మద్దతు ధర కరువు
- కొనుగోలు కేంద్రాలకు రైతుల పరుగులు
- కౌలు రైతులకు తప్పని ఎదురు దెబ్బలు
- ఈకేవైసీ చేయలేదని కొనుగోలు నిరాకరణ
- తక్కువ ధరకు దళారులకు విక్రయం
- నష్టమే మిగిలిందంటూ ఆవేదన



మార్కెట్ యార్డులో అరబోసిన కంది



కంది బస్తాలు

పిడుగురాళ్ల: మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా కౌలు రైతుల దుస్థితి నెలకొంది. కంది పంట చేతిలో పెట్టుకుని అమ్ముదామనుకుంటున్న వారిని సమస్యలు చుట్టుముడుతున్నాయి. పెట్టుబడులకు తోడు కౌలు చెల్లించి పంట పండిస్తే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదు. పోనీ, ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలో విక్రయిద్దామనుకుంటే.. ఈకేవైసీ సాకు చూపి అధికారులు తెచ్చిన పంటను వెనక్కి పంపేస్తున్నారు. దీంతో ఎటూ పాలుపోని స్థితిలో కౌలు రైతులు కృంగిపోతున్నారు. గత ప్రభుత్వంలో కంది క్వింటా ధర రూ.11,500 ధర పలికింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలో రూ.7,550 ధర నిర్ణయించింది. ఇక మార్కెట్‌లో దళారులు కందిని రూ.6వేలకు మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. గతేడాది ఎకరాకు 7 నుంచి 8 బస్తాల దిగుబడి దిగుబడి.. ఈ ఏడాది వర్షాలు పడి పూత రాలిపోయి కేవలం సగానికి సగం దిగుబడి పడిపోయింది. కేవలం 3 నుంచి 4 బస్తాలు మాత్రమే ఒక ఎకరానికి దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు కౌలు రైతులకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఈకేవైసీ నిబంధనలు అడ్డురావడంతో వారు గత్యంతరం లేక కేవలం రూ.6 వేలకు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈకేవైసీ నిబంధన కౌలు రైతులకు శాపం

పిడుగురాళ్ల పట్టణంలోని మార్కెట్ యార్డులో సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. రైతులు మార్కెట్ యార్డుకు రావడంతోనే అధికారులు రైతుల పంట పొలాలు ఈకేవైసీలో చేయలేదని చెబుతున్నారు. ఈకేవైసీ అయితేనే కొనుగోలు చేస్తామని తేల్చి చెబుతున్నారు. పొలం యజమాని కౌలు రైతులకు పంట హక్కు పత్రాలు కల్పించకపోవడంతో కౌలు రైతులు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక పక్క దిగుబడి లేక, ధర లేక దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో కనీసం రూ. 8,500లు కంది పంటకు ధర కల్పిస్తే రైతులకు కాస్తంత గిట్టుబాటు ఉండే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి

ఈ ఏడాది కంది పంట సాగుకు ఎకరానికి సుమారు రూ. 30 వేలు పెట్టుబడి అయ్యింది. కౌలు మరో రూ.10వేలు, దీంతో మొత్తం పెట్టుబడి రూ. 40 వేలకు చేరింది. దిగుబడి చూస్తే కేవలం నాలుగు బస్తాలు మాత్రమే వస్తోంది. ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రంలో నిర్ణయించిన ధర కూడా ఈకేవైసీ మెలిక కైలు రైతుల నుంచి పంటను కొనుగోలు చేయడం లేదు. దీంతో దళారులకు కేవలం రూ. 6 వేలకే పంటను అమ్ముకోవాల్సి పరిస్థితి నేలకొంది. ఇలా విక్రయిస్తే ఎకరాకు సుమారు రూ. 24 వేలుమాత్రమే ఆదాయం వస్తుంది. కౌలు రైతులకు ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడి అయితే.. రూ. 16 వేలు నష్టం చవి చూడాల్సి వస్తోంది.

దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది



నేను నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని కంది పంట వేశాను. గతేడాది ఎకరానికి 8 బస్తాల దిగుబడి వస్తే.. ఈ ఏడాది నాలుగు బస్తాలే వచ్చింది. రూ.11,500 క్వింటాకు మద్దతు ధర ఉండగా.. నేడు రూ.7,550గా కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కౌలు రైతులకు ఈకేవైసీ నెపంతో పంటను కొనుగోలు చేయటం లేదు. దళారులకు కేవలం రూ. 6 వేలకు అమ్ముకోవాల్సి వచ్చింది. మొత్తం రూ. 64 వేల నష్టం వచ్చింది.

– ఉన్నం పిచ్చయ్య, కౌలు రైతు, పిడుగురాళ్ల

ఈ ఏడాది నిరాశే మిగిలింది



ఈ ఏడాది కంది పంట దిగుబడి తగ్గటంతో పాటు ధర కూడా పడిపోయింది. పెట్టుబడి, కౌలు పెరిగాయి. దిగుబడి తగ్గి ధర తగ్గటంతో నష్టం వాటిల్లింది. చివరకు కూలి కూడా గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఈకేవైసీ పెట్టడం ద్వారా కౌలు రైతులకు పొలం యజమానులు సహకరించకపోవడంతో కంది పంట దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది.

– సీహెచ్ శివకోటయ్య, కౌలు రైతు, పిడుగురాళ్ల

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

మాచర్ల: పట్టణంలోని మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉదయభాను మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఆరోగ్య సూత్రాలను తెలుసుకొని, పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య భద్రత గురించి బార్ అసోసియేషన్ అధ్యక్షులు యల్లాల రమేష్ యాదవ్, వై.కృష్ణమూర్తి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ బి.కిరణ్ కుమార్

మాచర్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం మూడు అర్జీలు అందినట్లు తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ తెలిపారు. విజయపురిసౌత్‌కు చెందిన జె.సుబ్బలక్ష్మి తను సాగు చేసుకుంటున్న భూమికి పట్టా మంజూరు చేయాలని, పట్టణానికి చెందిన షేక్ ఖలీల్ అహ్మద్ తనకు చెందిన భూమిని తన సోదరుడు అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నాడని తగు చర్య తీసుకోవాలని, పట్టణంలో నివసించే పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలని వెంకటేష్ జాంబవరాజు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్ తరగతులు ప్రారంభం



విద్యార్థినులతో ప్రిన్సిపల్ లక్ష్మి, ఉపాధ్యాయులు

నకరికల్లు: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ప్రవేశానికి గాను దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 11వ తేదీ వరకు మాత్రమే అవకాశముందని ప్రిన్సిపాల్ లక్ష్మి తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులను సోమవారం ప్రారంభించారు. విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు, రెండవ సంవత్సరం ఎంపీసీలో ఆరు సీట్లు, 10వ తరగతిలో ఒక సీటు, ఆరవ తరగతిలో 40 సీట్లు భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. నాణ్యమైన భోజనం, ఉచిత విద్య, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. డ్రాపౌట్స్, తల్లిదండ్రులు లేని పిల్లలు, అనాథలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ జోతిర్మయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ సంవత్సరం చదువుతున్న 36 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు కూడా అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియెట్‌లో, 7,8,9,10వ తరగతులలో చేరే విద్యార్థులు ఈ నెల 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీపీ మొరబోయిన సుబ్బాయమ్మ

నరసరావుపేట రూరల్: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మొరబోయిన సుబ్బాయమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సుబ్బాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ యాసిన్ మాట్లాడుతూ బోర్లు మరమ్మత్తులు పూర్తిచేయడంతో పాటు చెరువులను నీటితో నింపుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకం టెండర్ల దశలో ఉందని తెలిపారు. జలజీవన్ మిషన్ పథకంలో నిర్వహిస్తున్న పనులపై జెడ్పీటీసీ చిట్టిబాబు, పలువురు ఎంపీటీసీలు ప్రశ్నించారు. కనెక్షన్ కోసం మెయిన్ పైప్ నుంచి కుళాయి ఇచ్చే పైప్ చిన్నదిగా ఉండటంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని తెలిపారు.

దీంతో పాటు ఆయా పనుల కోసం తవ్విన గుంతలను కాంట్రాక్టర్లు వెంటనే పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై సత్వరం చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రూ.3 కోట్ల పనులకు టెండర్లు పూర్తచేసినట్టు తెలిపారు. అయితే ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏవో సురేంద్రబాబు, ఏపీవో కోటేశ్వరరావు, ఈవోపీఆర్డీ నాగానంద్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

నరసరావుపేట: సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన తెలుగుదేశం పార్టీ నాయకుడు బొడ్డు వెంకటేశ్వరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు లైంగిక వేధింపుల సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేపీ మెటిల్డాదేవి, గుంటూరు మల్లీశ్వరిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు తాత్సారం చేశారని ఈ నేపథ్యంలో వేధింపులు మరింత ఎక్కువ కావడంతో ప్రజా ప్రతినిధులకు సెల్ఫీ వీడియో విడుదల చేయడం వెనుక పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు అర్థం చేసుకోవాలన్నారు. ఇటీవల నకరికల్లు మండలం పాపిశెట్టి వారిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ ఫాతిమా బేగం రాజకీయ, లైంగిక వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న ఘటనను గుర్తు చేశారు. గతంలో వంట గదికి పరిమితమైన మహిళలు సత్తా చాటి అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అంగన్‌వాడీ రంగంలో గౌరవ వేతనం తీసుకుంటూ విశేషసేవలు అందిస్తున్న మహిళలను గౌరవించి, ప్రోత్సహించాలన్నారు. వెంటనే హోం మంత్రి అనిత స్పందించి ఈ కేసులో విచారణ వేగవంతం చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వేధింపులకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

10న చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన దేవాలయం



దేవాలయంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి మూలవిరాట్



రథానికి తుది మెరుగులు

మాచర్ల: పల్నాడులో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు ఈ నెల 10న అంకురార్పణ జరగనుంది. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. 11న ధ్వజారోహణ, 12న కల్యాణోత్సవం, 13న హనుమద్వాహనం, 14న శేషవాహనం, 15న గరుడవాహనం, 16న రవిపొన్న వాహనం, 17న రథోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. గురజాల డీఎస్పీ జగదీష్, అర్బన్ సీఐ ప్రభాకర్ రథోత్సవం ఎటువంటి ఆటంకం లేకుండి జరిగిందుకు ఏర్పాట్లు చేయిస్తున్నారు. 16 రోజుల పండగతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. కల్యాణం, రథోత్సవం జయప్రదం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పాపిరెడ్డి మృతి బాధాకరం



మాచర్ల : ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, ప్రజల మనిషి మోదుగుల పాపిరెడ్డి మృతి ఎంతో బాధాకరమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి తండ్రి అయిన పాపిరెడ్డి మృతి తనను కలచి వేసిందన్నారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని వి.తులసీతన్మయ్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు సోమవారం తెలిపారు. తెనాలిలో ఈనెల ఈనెల 2, 3తేదీలలో నిర్వహించిన 5వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాడేట్ అండ్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ – 2025 పోటీలో తులసీతన్మయ్ 49కేజీల విభాగంలో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు వివరించారు. ఢిల్లీలో ఆగస్టులో నిర్వహించనున్న 5వ జాతీయస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయ గుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్ అభినందించారు.

స్కూల్ తరలింపు ప్రయత్నం మానుకోవాలి



ఎంఈఓ–2 రాఘవేంద్రరావుకు వినతిపత్రం అందజేస్తున్న నందిగామ ఎస్సీ కాలనీ వాసులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ కాలనీలోని ఎంపీపీఎస్(ఎల్ ఈ) పాఠశాల తరలింపు ప్రయత్నం మానుకోవాలని నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండల విద్యాశాఖ అధికారి–2 ఏ రాఘవేంద్రరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని స్కూలును ఓసీ కాలనీకి తరలించడానికి కూటమి ప్రభుత్వంలోని నాయకులు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ కాలనీలో ఒకటో తరగతి, రెండో తరగతి మొత్తం 36 మంది విద్యార్థులు ఉన్నారన్నారని, అంగన్‌వాడీ కేంద్రంతో కలిసి మొత్తం పిల్లలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అదీ కాకుండా 15 మంది ఉన్న ఓసీ కాలనీ ఎంపీపీఎస్(హెచ్‌ఈ) స్కూల్‌కి పంపించాలని ఎస్సీ కాలనీవాసులను టీడీపీ మండల కన్వీనర్ ఆళ్ల అమరేశ్వరరావు బెదిరిస్తున్నాడని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని విద్యార్థి కమిటీ, తల్లిదండ్రులు కోరారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



నాగిరెడ్డిపాలెంలో బోర్‌ప్రారంభిస్తున్న ఎంపీడీవో

బెల్లంకొండ: వేసవిలో గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎంపీడీఓ వై. హనుమారెడ్డి తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన బోరును స్థానిక నాయకులతో కలసి ఎంపీడీవో ప్రారంభించారు. కాలనీ ప్రజలు నీటి అవసరాల కోసం ఇబ్బందుల పడుతుండడంతో బోరును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుని పని చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, ఈవోపీఆర్డీ వెంకట గిరిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ వసంతరావు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచాయి. ఈదురు గాలులకు అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు గంట పాటు ఈ పరిస్థితి నెలకొంది. ఈదురు గాలులు తగ్గినప్పటికీ విద్యుత్ సరఫరా జరగలేదు. పిడుగురాళ్ల ప్రాంతంలో వర్షంతో కూడిన వీదురు గాలులు వీచటం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిదని తెలిసింది. అయితే మండలంలో రాత్రి నెలకొన్న వాతావరణ పరిస్థితులకు వర్షం పడుతుందని ప్రజలు ఊహించారు. ఈదురు గాలుల వల్ల వర్షం కురియలేదని ప్రజలు అభిప్రాయపడ్డారు.

నరసరావుపేట: పట్టణంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలులు తగ్గిన తర్వాత కొన్ని ప్రదేశాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు వద్ద ఫీజులు ఎగిరిపోవటంతో లైన్‌మెన్‌లో వాటిని సరిచేసే ప్రయత్నాలు చేశారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బలమైన ఈదురు గాలులకు తేలికపాటి వస్తువులు కొట్టుకొపోయాయి. ఎక్కడా ఆస్తినష్టం జరిగినట్లుగా సమాచారం లేదు.

చోరీ కేసుల్లో జైలు, జరిమానా

నరసరావుపేటటౌన్: : వేర్వేరు ప్రాంతాల్లో మోటార్ సైకిల్ దొంగిలించినట్లు నేరం రుజువు అవడంతో వరవ కట్టకు చెందిన షేక్ అష్రఫ్‌కు ఒక్కొక్క కేసులో మూడు నెలల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి టి. ప్రవల్లిక సోమవారం తీర్పు చెప్పారు. నిందితుడు 2024లో మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మూడు ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో కోర్టు తీర్పునిచ్చింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: మాచర్ల నియోజక వర్గంలో రెంటచింతల, రాయవరం జంక్షన్ 33కేవీ ఫీడర్ లైన్ షిఫ్టింగ్ నిమిత్తం సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందని డీఈ ఎ.రామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.11కేవీ రాయవరం, ఆత్మకూరు, ఇండస్ట్రియల్, కంభంపాడు ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.